# "మా అల్లరి రాజు"

మా అల్లరి రాజునుగురించి ఇంతకుముందు ఒక సంఘటన రాశాను. వాడు ఎన్నో అల్లరి చిల్లరి చిలిపి పనులు చేస్తుంటాడు. అందులో ఇది కూడా ఒకటి!

నేను లైబ్రరీకి రెగ్యులర్ గా వెళ్తుంటాను. ఇంటిలో మా ఆవిడను విసిగిస్తుంటాడని ఎందుకైనా మంచిదని మా రాజును కూడా లైబ్రరీకి తీసుక వెళ్లాను. వీణ్ణి ఎక్కడికైనా తీసుక వెళితే చంకలో పిల్లిని వెంటబెట్టుకుని వెళ్ళినట్లే.

మా రాజు బొద్దుగా ఎఱ్ఱగా ముద్దుగా వుంటాడులెండి. మా రాజును వెంటబెట్టుకెళితే చూసిన మా ఫ్రెండ్స్ అంతా 'అబ్బా! ఎంత చక్కని బాబురా, మీవాడు!' అని అంటారని నేను కాస్త ఉబ్బిపోదామని తీసుక వెళ్ళాను.

లైబ్రరీలో చాలామంది వున్నారు. చాలా నిశ్శబ్దంగా వుంది. నేను కుర్చీలో కూర్చొని, మా వాడిని ప్రక్కన కుర్చీలో కూర్చోబెట్టాను. వాడి చేతికి ఒక బొమ్మల పుస్తకం ఇచ్చాను- అల్లరి చేయకుండా. నేను పేపరు చూడ్డంలో నిమగ్నమైపోయాను. కాసేపున్న తర్వాత మా వాడు నన్ను లాగడం మొదలెట్టాడు, 'డాడీ! డాడీ!' అని పిలుస్తూ. వాడికి ముందే చెప్పాను అక్కడ అల్లరి చెయ్యకూడదని. వాడు ఎంత పిలిచినా నేను వాణ్ణి చూడకుండా పేపరు చూడ్డంలోనే మునిగిపోయాను. వాడు ఈసారి 'డాడీ!' అని పెద్దగా పిలిచి 'గున్నూ! గున్నూ!' అన్నాడు. తలెత్తి ఎదురుగా చూశాను - మా వాడు చూపిస్తున్న దిక్కు. ఎదురుగా ఒక పెద్దమనిషి కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాడు. ఆయన్నే వాడు చూపిస్తున్నాడు. ఆయనది నున్నటి గుండు. అందరూ తలెత్తి




చూశారు. నేను 'ష్' అని తల వొంచుకున్నాను పాపం ఆయన ఎక్కడ చూస్తాడో అని. కానీ మా వాడు వూరుకోలేదు. నేను సరిగా విన్లేదనుకొని చాలా పెద్దగా "డాడీ! గున్నూ! గున్నూ!" అన్నాడు. ఇంకేముంది, ఆయన చూశాడు గుర్రుమంటూ! ప్రక్కనున్న వారంతా మా వాడి మాటలకు చిన్నగా నవ్వుకుంటున్నారు. నేను మావాడి నోరు నొక్కాను. గానీ లాభం లేదు. వాడు నా చెయ్యి కొరికి "డాడీ! గున్నూ! గున్నూ!" అని ఆయన్ను చూపిస్తూ పెద్దగా ఏడిచేశాడు. నే నొక్కటి అంటించాను, చేసేది లేక. మా వాడు పెద్దగా ఏడుస్తూ అదే పాట 'డాడీ! గున్నూ! గున్నూ!' అని. ఇక నేను వాణ్ణి తీసుకుని బయటకు వచ్చేశాను.

—"ప్రవీణ్ సుశ్రీ"



మన్నికకు, ఆహ్లాదానికి....

పంజు టెక్స్ వారి

◆ మాస్టర్ ◆ ఫాంటెక్స్

ఫైన్ బనియన్లనే వాడండి.

ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు:—

దుర్గా ఏజెన్సీస్, పో. బా. నెం. 84, విశాఖపట్నం-4.